క్లుప్తంగా

నేటి నుంచి త్యాగరాజ స్మరణోత్సవాలు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో భిక్షాటన పూర్వక త్యాగరాజ స్మరణోత్సవాలను శనివారం నుంచి ఏప్రిల్ ఐదు వరకు నిర్వహించనున్నామని త్యాగరాజ స్మరణోత్సవ సభ కమిటీ శాశ్వత కార్యదర్శి యనమంద్ర నాగదేవీప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను పురమందిరంలో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఫాల్గుణ బహుళ పంచమిని పురస్కరించుకొని వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిరం నుంచి సీతారామ, లక్ష్మణ, హనుమత్ సమేత త్యాగరాజ ఉత్సవమూర్తులు, చిత్రపటాన్ని పురమందిరం వరకు ఊరేగింపుగా శనివారం తీసుకురానున్నామని వివరించారు. స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ, కలశస్థాపన, పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టనున్నామని చెప్పారు. వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులతో సంగీత కచేరీలను రోజూ నిర్వహించనున్నామని వివరించారు. కార్యక్రమానికి భక్తులు తరలిరావాలని కోరారు. స్మరణోత్సవ సభ కమిటీ ఉపాధ్యక్షుడు అన్నవరం సత్యనారాయణ, అవధానం రామ్‌ప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శి మల్లికార్జునరావు, సహాయ కార్యదర్శి పామర్తి బలరామ్, సభ్యులు మాధవరావు, శ్రీరామగిరి హనుమంతరావు, వెంకటేశ్వర్లు, యద్దనపూడి ధనుంజయ, కమల, దుర్భా జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

బాబా మందిరానికి రూ.రెండు లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరానికి తన్నీరు సుందర్‌రాజా కుటుంబ సభ్యులు రూ.2,00,116 నగదును శుక్రవారం మందిర సేవా సమితి సొసైటీ బాధ్యులకు అందజేశారు. అన్నదానానికి వినియోగించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దాత సుందర్‌రాజాకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు చీమకుర్తి రాజగోపాల్, తరుగు ప్రభాకర్, సుబ్బానాయుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

• సీఐ రాంబాబు

పొదలకూరు: ఎన్నికల నిర్వహణకు ప్రజలంతా పూర్తి సహకారం అందించాలని సీఐ ఆర్.రాంబాబు కోరారు. పట్టణంలోని సంగం రోడ్డు సెంటర్ నుంచి గేటు సెంటర్ వరకు మండలంలోని చాటగొట్ల గ్రామంలో శుక్రవారం సాయుధ (బీఎస్ఎఫ్) బలగాలు, ఎస్సై రామకృష్ణతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు తమ ఓటును స్వేచ్ఛాయుత వాతావరణంలో వేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. అల్లర్లు సృష్టించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బీఎస్ఎఫ్ జవాన్లతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించి ఓటర్లకు భరోసా కల్పించారు.

ఆశాజనకంగా ధాన్యం ధరలు

కొడవలూరు: ధాన్యం ధరలు ఆశాజనకంగా ఉన్నాయని కోవూరు ఏడీఏ డి.సుజాత స్పష్టం చేశారు. మండలంలోని కమ్మపాళెంలో ధాన్యం విక్రయిస్తున్న రైతుల వద్దకు శుక్రవారం ఆమె వెళ్లి ధరలను ఆరా తీశారు. ఏ గ్రేడ్ రకాలైన బీపీటీ 5202ను పుట్టి రూ.22,000 నుంచి రూ.22,500కు, కేఎన్ఎం 1638ను పుట్టి రూ.21 వేలకు విక్రయిస్తున్నట్లు అన్నదాతలు తెలిపారు. దిగుబడి బాగున్నట్లు వెల్లడించారు. ఏడీఏ వెంట ఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి, వీఏఏలు ఒ.సుజిత్, జి.ఉమామహేష్ ఉన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక

కోవూరు: కోవూరు బార్ అసోషియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కే సలీం బాషా, పూండ్ల స్టాలిన్‌బాబు ఎన్నికయ్యారు. ఈ మేరకు అసోషియేషన్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. సలీంబాషా తన ప్రత్యర్థి చెన్నయ్యపై, స్టాలిన్‌బాబు చిట్టేటి చంద్రమోహన్‌పై గెలుపొందారు. వారికి పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

ఇఫ్తార్ విందు

ఆత్మకూరు: ఆత్మకూరుకు చెందిన శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి శుక్రవారం రాత్రి పెద్ద మసీదులో ఇఫ్తార్ విందు ఇచ్చారు. పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షల్లో ఉన్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. సుమారు 450 మందికిపైగా ముస్లింలు విందును స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



బాప్టిస్ట్ చర్చి డౌనీహాల్లో సప్తవాక్కుల ఆరాధన

నెల్లూరు(బృందావనం): గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని నగరంలో భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఏబీఎం కాంపౌండ్‌లోని లోన్‌స్టార్ బాప్టిస్ట్ చర్చిలో రెవరెండ్ కంచర్ల ప్రభుదాస్, రెవరెండ్ సాలి విజయరత్నం, పాస్టర్ ఇమ్మానుయెల్ విజయకుమార్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు.

➡ సంతపేటలోని రోమన్ క్యాథలిక్ క్యాథెడ్రల్‌లో బిషప్ మోస్ట్ రెవరెండ్ ప్రకాశం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

➡ రైల్వేఫీడర్స్ రోడ్డులోని లోన్‌స్టార్ బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ బెన్హర్‌బాబు ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు.

➡ వీఆర్సీ సెంటర్ సమీపంలోని బాప్టిస్ట్ చర్చి డౌనీ హాల్లో సంఘ కాపరి రెవరెండ్ శ్యామ్‌సన్‌కుమార్ ఆధ్వర్యంలో సప్తవాక్కుల ప్రత్యేక ఆరాధనను నిర్వహించారు. శిలువపై యేసుక్రీస్తు పలికిన ఏడు మాటలను బ్రదర్ శుభకర్, రెవరెండ్ డేవిడ్ లివింగ్‌స్టన్, ధనుంజయ, మార్తా మధురిమ, సంజయ్, డాక్టర్ కృపాల్, అనితారాయ్ వివరించారు. భక్తి కీర్తనలను గాయక బృందం ఆలపించారు. సంఘ చైర్మన్ సురేంద్రబాబు, కార్యదర్శి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

➡ నగరంలోని వివిధ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ప్రత్యేక ప్రార్థనల్లో ఖలీల్ అహ్మద్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కపాడిపాళెంలోని సెయింట్ జోసఫ్స్ ఆర్సీఎం చర్చిలో నిర్వహించిన ప్రార్థనలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్ హాజరయ్యారు. శిలువ మోసి, ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. కార్పొరేటర్ సాహిత్య తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనల్లో పాల్గొనడం అదృష్టం

నెల్లూరు సిటీ: గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనడం తనే అదృష్టమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 36వ డివిజన్లోని ఫతేఖాన్‌పేటలో గల పునీత ఆంథోనీ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు ఆయన హాజరయ్యారు. అనంతరం ఆయన శిలువ మోశారు. పార్టీ అధికార ప్రతినిధి జూపూడి ప్రభాకర్, పార్టీ డివిజన్ ఇన్‌చార్జి పిండి సురేష్, మలిరెడ్డి కోటారెడ్డి, ప్రభాకర్, దాసరి రాజేష్, ఎలీషా, పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి, మైనార్టీ నేత ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

➡ 12వ డివిజన్లోని చింతారెడ్డిపాళెంలో గల ఆర్సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి నిర్వహించారు.



పునీత ఆంథోనీ చర్చిలో..



ప్రార్థనలు చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి



ప్రార్థనలకు హాజరైన ఖలీల్ అహ్మద్

రూరల్‌ను ప్రథమ స్థానంలో నిలుపుతా



ఎన్నికల ప్రచారంలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపడమే తన ధ్యేయమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్‌లోని 22వ డివిజన్లో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. గడిచిన పది నెలల్లో నియోజకవర్గాన్ని రూ.150 కోట్లతో అభివృద్ధి చేశామని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తానని వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి.. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. మేయర్ స్రవంతి, పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, కార్పొరేటర్ మూలె విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి, క్లస్టర్ అధ్యక్షుడు పాతపాటి పుల్లారెడ్డి, నేతలు రాపూరు కొండారెడ్డి, దొడ్ల శేషారెడ్డి, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి మద్దతుగా..

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని అర్హులకు సంక్షేమ పథకాలు అందాయని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేయనున్న తన తండ్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని హిమబిందు కోరారు. 36వ డివిజన్లో శుక్రవారం నిర్వహించిన ప్రచారంలో ఆమె మాట్లాడారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, పార్టీ విజయం తథ్యమనే అంశం దీని ద్వారా స్పష్టమవుతోందని చెప్పారు. కార్పొరేటర్ పిండి శాంతి, పార్టీ డివిజన్ ఇన్‌చార్జి పిండి సురేష్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెస్సెమ్ఈ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ కోఆర్డినేటర్ లక్ష్మీసునంద, క్లస్టర్ – 1 అధ్యక్షుడు ముడియాల రామిరెడ్డి, దారా వంశీ, పఠాన్ అస్లామ్‌ఖాన్, కొండేటి శివారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, బాబ్జీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న ఆదాల కుమార్తె హిమబిందు

ఘనంగా పంచవృత్తుల పతాకావిష్కరణ



నెల్లూరు(బృందావనం): విరాట్‌నగర్‌లోని వీబీఎస్ కల్యాణ మండప ప్రాంగణంలో పంచవృత్తుల పతాకాన్ని నెల్లూరు పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘ ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. సంఘ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని తొలుత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో గాయత్రి అమ్మవారు, విశ్వకర్మ భగవాన్, గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు చేశారు. సంఘ శాశ్వత గౌరవాధ్యక్షుడు కందుకూరు చెంగయ్య ఆచారి, నిర్వాహకులు సుబ్రహ్మణ్యం, ఇందుకూరు రమేష్, దండపాణి సురేష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలను తప్పక పాటించండి

నెల్లూరు(బారకాసు): వేసవి తీవ్రత నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని మేయర్ స్రవంతి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. నగరపాలక సంస్థ అధికారులు ప్రజలకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?

నెల్లూరు(దర్గామిట్ట): నగర నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రసాద్ పేర్కొన్నారు. మాగుంట లేఅవుట్లోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ పదవిని పొంది మంత్రి హోదాను నారాయణ అనుభవించినా, నగరాన్ని తూతూమంత్రంగా అభివృద్ధి చేశారని విమర్శించారు. ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డిపై మాట్లాడే స్థాయి రూప్‌కుమార్‌యాదవ్‌కు లేదని చెప్పారు. సర్వేపల్లి కాలువ అభివృద్ధితో పాటు కోట్లాది రూపాయలతో నగరంలో అభివృద్ధి పనులను అనిల్ చేపట్టారని గుర్తుచేశారు. అనిల్‌పై బెట్టింగ్ మచ్చను రూప్‌కుమార్ తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. పార్టీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వద్ద లబ్ధి పొందింది వాస్తవం కాదానని ప్రశ్నించారు. విలువలతో కూడిన రాజకీయాలు చేసే వారెవరూ రూప్‌కుమార్‌ను దగ్గర చేర్చుకోరన్నారు. త్వరలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సైతం ఆయన్ను సాగనంపడం ఖాయమని చెప్పారు.

భారీ మెజార్టీతో గెలిపించండి

నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా 27వ డివిజన్లోని చంద్రమౌళీనగర్‌లో ఎన్నికల ప్రచారాన్ని పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఆదాలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కరపత్రాలను అందజేశారు.

• రూరల్‌లోని 21వ డివిజన్లో గల ఉమ్మారెడ్డిగుంటలో ఎన్నికల ప్రచారాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి మొయిళ్ల సురేష్‌రెడ్డి నిర్వహించారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నేతలు పెంచలనర్సారెడ్డి, సుబ్బారావు, మాల్యాద్రి, సాయి, రమణయ్య, సాయన్న తదితరులు పాల్గొన్నారు.



27వ డివిజన్లో వైఎస్సార్‌సీపీ నేతల ప్రచారం

వైఎస్సార్‌సీపీలో యాదవులకు అధిక ప్రాధాన్యం

• రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

నెల్లూరు సిటీ: ప్రస్తుత ప్రభుత్వం యాదవులకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు కోరారు. కనుపర్తిపాడు, కల్లూరుపల్లి, బుజబుజ నెల్లూరు ప్రాంతాలకు చెందిన యాదవులతో ఆత్మీయ సమావేశాన్ని కనుపర్తిపాడులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పార్టీని మరోసారి గెలిపించాలని కోరారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డికి యాదవుల సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు. అనంతరం పార్టీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. నెల్లూరు రూరల్ నుంచి తనను.. నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరారు.

➡ బీద మస్తాన్‌రావు, ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో దేవరాల వెంకటరమణయ్య నేతృత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరారు. మద్దిబోయిన భానుయాదవ్, మద్దిబోయిన కృష్ణయాదవ్, ఉడతా సుధాకర్‌యాదవ్, ఆవుల రమేష్‌యాదవ్, నీళ్ల కృష్ణయాదవ్ తదితరులు పార్టీలో చేరారు. మేయర్ స్రవంతి, ఏఎంసీ మాజీ చైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి హరిబాబుయాదవ్, 24వ డివిజన్ ఇన్‌చార్జిలు సునీల్‌యాదవ్, మురళీయాదవ్, రామలింగారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ఇసనాక సురేంద్రరెడ్డి, అన్నపరెడ్డి శేఖర్, మలిరెడ్డి కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




ప్రభుత్వ బడి కొత్తగా..

ముత్తుకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదుల కొరతను తీర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మనబడి నాడు – నేడు పథకం, నాబార్డు నిధుల ద్వారా పెద్దఎత్తున భవనాలు, అదనపు గదుల నిర్మాణం చేపట్టింది. చాలాచోట్ల పూర్తవడంతో బడులు కొత్త రూపు సంతరించుకున్నాయి. ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్లో నాబార్డు నిధులు రూ.1.92 కోట్లతో అదనపు గదుల నిర్మాణం ఆఖరి దశకు చేరింది. ఇదే విధంగా నాడు – నేడు నిధులు రూ.1.92 కోట్లతో చేపట్టిన కొత్త భవన నిర్మాణం పూర్తయ్యింది. మరోవైపు బాలయోగి గురుకుల పాఠశాలలో నాబార్డు నిధులు రూ.1.43 కోట్లతో సర్వాంగ సుందరంగా భవనాన్ని నిర్మించారు.



గురుకుల పాఠశాల భవనం

సమస్యలను వెంటనే పరిష్కరించాలి



కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరును పరిశీలిస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): నగరంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గల మానిటరింగ్ విభాగాన్ని శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి.. వీటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశామని వివరించారు. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను స్క్రీన్ల ద్వారా గుర్తించాలని కోరారు. వీటిని సంబంధిత అధికారులకు వెంటనే తెలియజేయాలని సూచించారు. ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని స్పష్టం చేశారు. ఎన్నికల నేపథ్యంలో మానిటరింగ్ విభాగ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ స్క్రీన్లపై తిలకించిన దృశ్యాల్లో ఏమైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రామ్మూర్తినగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ బాలాజీనగర్, ఆదిత్యనగర్ ఫీడర్లలో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలాజీనగర్, ఆదిత్యనగర్, పుట్టవీధి తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

ఆదాలతోనే మా పయనం

నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డితోనే తమ పయనమని పలువురు పేర్కొన్నారు. 18వ డివిజన్లోని సర్వేపల్లి కాలువకట్ట ప్రాంతానికి చెందిన మాచర్ల రమణయ్య 300 మందితో కలిసి పార్టీలో శుక్రవారం తిరిగి చేరారు. నగరంలోని తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరికి పార్టీ కండువాలను కప్పి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తమను పిలిపించి.. పార్టీలో చేరామంటూ కండువాలను కప్పారని ఆరోపించారు. అనంతరం ఆదాల మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు.. చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్న వారికి కృతజ్ఞతలను తెలియజేశారు. సర్వేపల్లి కాలువకట్ట ప్రాంతంలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పార్టీ నేత మలిరెడ్డి కోటారెడ్డి, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి, యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

➡ 33వ డివిజన్లోని నేతాజీనగర్‌కు చెందిన పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. నగరంలోని తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరికి పార్టీ కండువాలను కప్పి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. సరోజనమ్మ, కృష్ణవేణమ్మ బాలకృష్ణ తదితరులు వారి అనుచరులతో పార్టీలో చేరారు. పార్టీ డివిజన్ ఇన్‌చార్జి మేఘనాథ్‌సింగ్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నేతలు మోషే, శ్రీను, అశోక్‌దాస్, అశోక్, చంద్రమౌళి, సుందరం, వెంకటేశ్వర్లు, ధన తదితరులు పాల్గొన్నారు.

➡ 41వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి అద్దంకి కృష్ణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మహేశ్వరినగర్‌కు చెందిన టీడీపీ ఇన్‌చార్జి ప్రసాద్, కట్టా చిన్నా తదితరులు పార్టీలో చేరారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి, కార్పొరేటర్ కువ్వాకొల్లు విజయలక్ష్మి, డివిజన్ ఇన్‌చార్జి కువ్వాకొల్లు బాబ్జీయాదవ్, ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, వేలూరు గోపీప్రసాద్, శీను, ఏడుకొండలు, రాజా, మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రమణయ్యను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి





పార్టీలో చేరిన వారితో ఆదాల